క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ భక్తిభావనతో మెలగాలి



గోకవరంలో త్రైతసిద్ధాంత భవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: అందరూ భక్తి భావనతో మెలగాలని త్రైత సిద్ధాంత హిందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవా సమితి ఆత్మకూరు కమిటీ అధ్యక్షుడు మునిదాసు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని గోకవరం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు భగవద్గీతను చదివి భక్తిభావనతో నడవాలన్నారు. భగవద్గీతను చదవడం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవచ్చునని, మంచి,చెడులకు తేడా తెలుస్తుందని, సన్మార్గంలో ప్రతి మనిషి నడిచేందుకు దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు భాస్కర్, ప్రకాష్, నాగన్న, వేంకటేష్, స్వర్ణ, అనిత పాల్గొన్నారు.

చలువపందిళ్ల తొలగింపు



ఆలయ ప్రాంగణంలోని చలువ పందిళ్లు తొలగిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమేశ్వరాలయంలో వేసవి కాలంలో ఎండతీవ్రత నుంచి భక్తులకు ఉపశమనంగా వేసిన చలువ పందిళ్లను ఆదివారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో తొలగించారు. గత నాలుగురోజుల నుంచి ఎడతెరిపిలేని వర్షాలు పడుతున్నాయి. దీంతో వాతావరణం చల్లబడడంతో, సంగమేశ్వరానికి ఎగువ నుంచి వరదనీరు రావడంతో చలువ పందిళ్లను, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైన్లను కూడా తొలగించారు.

మణిపూర్ ఘటనలో దోషులను ఉరితీయాలి



ఆత్మకూరులో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: మణిపూర్ రాష్ట్రంలో ఆటవిక చర్యలకు పాల్పడిన మృగాలను ఉరి తీయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయకుడు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ నాయకులు గౌడ్‌సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో కొద్ది మంది అల్లరిమూకలు గిరిజన తెగలకు చెందిన మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ, శ్రీనివాసులు, ప్రసాద్, ప్రతాప్ పాల్గొన్నారు.

అల్లరిమూకలను కఠినంగా శిక్షించాలి

జూపాడుబంగ్లా: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన నిందితులను బహిరంగంగా ఉరితీయాలని బీఎస్పీ జిల్లా నాయకుడు లాజర్, సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు, బీఎస్పీ తాలూకా నాయకుడు స్వాములు డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రమైన జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేజీరోడ్డుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, మధు, రాజు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఈ -క్రాప్ నమోదు చేయించుకోండి

జూపాడుబంగ్లా: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను రైతులు గ్రామాల్లోని ఆర్బీకేల్లో సంప్రదించి ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం 25వేల హెక్టార్లు ఉండగా ఇప్పటిదాకా 6,500 ఎకరాల్లో పత్తి, మిరప, మొక్కజొన్న, కంది, మినుము, పెసర పంటలు సాగుచేసినట్లు తెలిపారు. ఈ క్రాప్ నమోదు చేయించుకోవటం వల్ల ప్రకృతివైపరీత్యాలు సంభవించినప్పుడు సులభంగా పంట నష్ట పరిహారం పొందవచ్చన్నారు. పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు విక్రయించుకొనే అవకాశం లభిస్తుందని తెలిపారు.

వడ్డెర్ల సమస్యలు పరిష్కరించాలి

మహానంది: వడ్డెర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ వడ్డెర సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు చల్లా వెంకటేష్ తెలిపారు. బండిఆత్మకూరులో ఆదివారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోటికిపైగా వడ్డెరలు ఉన్నారని, ఆర్థికంగా వెనుకబడ్డారన్నారు. వడ్డెర కార్పొరేషన్ ద్వారా కాంట్రాక్టు పనులు కేటాయించాలని కోరారు. గనుల్లో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి బీమా సౌకర్యం కల్పించి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బాలుడు, చల్లా శ్రీను, సంపంగి శివ, భాస్కర్, రవి పాల్గొన్నారు.

మాన్యం భూములున్నా నిర్వహణ సున్నా

- శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయానికి ఏటా రూ.9లక్షల ఆదాయం
- నిర్వహణ పట్టించుకోని అధికారులు
- పైకప్పు పెచ్చులూడి పడుతున్న వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న భక్తులు



వాడాల గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం

పాములపాడు: ఏ ప్రాంతంలోనైనా దేవుడంటే అందరికీ భక్తి, నమ్మకం. దేవాలయాల్లో తప్పని సరిగా ధూప దీప నైవేద్యాలతో స్వామి వారికి పూజలందిస్తారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, అందరిని చల్లగాచూడాలని వేడుకోవడం సర్వసాధారణం. అయితే దేవాలయాలకు ఏటా లక్షల్లో ఆదాయం వస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండలంలోని వాడాల గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయానికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా ఆలయ నిర్వహణ గాలికొదిలేయడంతో శిథిలావస్థకు చేరింది.

40 ఎకరాల మాన్యం భూమి..

మండలంలోని వాడాల గ్రామంలో శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం పూర్వం నుంచి ఉంది. ఆలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరిపై పెచ్చులూడి పడుతోంది. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వీడలేదు. దేవాలయానికి సంబంధించి 40 ఎకరాల మాన్యం భూములున్నాయి. వీటికి గాను ప్రతి ఏటా రూ.9లక్షల మేర ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ దేవాలయం నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. దేవాదాయ శాఖ అధికారులు ప్రతి సంవత్సరం రావడం, మాన్యం భూములకు వేలం పాట నిర్వహించడం, ఆదాయాన్ని తీసుకెళ్లడం మినహా ఆలయ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

సర్దిచెప్పడం.. పని జరుపుకోవడం

దేవాలయం శిథిలావస్థకు చేరిందని, మరమ్మతు చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేస్తూ గ్రామస్తులు వేలం పాటలు నిర్వహించకుండా అడ్డుకున్న సంఘటనలు లేకపోలేదు. పోలీసులు బందోబస్తు మధ్య గ్రామపెద్దలు, రైతులకు సర్ది చెప్పి వేలం పాటలు కొనసాగించడం పరిపాటిగా మారింది. మరుసటి సంవత్సరం మరలా ఇదే తంతు. ఇలా పలు మార్లు జరుగుతూనే ఉంది.

పెచ్చులూడుతున్న పైకప్పు

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందునపై కప్పు పెచ్చులూడి కింద పడ్డాయి. దీంతో భక్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భక్తితో కాకుండా భయంతో స్వామి వారి ఎదుట పూజలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. పండుగల వేళ ఆలయానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఏదైనా జరిగితే ప్రమాదానికి గురికావాల్సిందేనని భయందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని



దేవాలయం పై కప్పు పెచ్చులూడి పడిన దృశ్యం

వేలాలు నిలిపినా స్పందన లేదు



దేవాలయంలో పెచ్చులూడి పడుతుంటే దేవాలయంలోకి వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో 3సార్లు వేలం పాటలు నిలిపివేశాం. ఈ సంవత్సరం కచ్చితంగా చర్యలు తీసుకుంటామని చెప్పడం వారి పని ముగించుకొని వెళ్లిపోవడమే అధికారుల వంతైంది.

– నారాయణరెడ్డి, గ్రామస్తుడు

నిర్మాణం చేపట్టాలి



శ్రీచెన్నకేశవ స్వామి దేవాలయం నూతన నిర్మాణం చేపట్టాలి. ఆలయం శిథిలావస్థకు చేరింది. పట్టించుకునే వారే కరువయ్యారు. అప్పుడు ఇప్పుడు అంటూ కాలయాపన చేయడం మినహా ఆలయ నిర్మాణాలనికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. త్వరలో నూతన దేవాలయం నిర్మించాలి. –అల్లబకాష్, గ్రామస్తుడు

టెండర్లకు పిలిచాం

దేవాలయ నిర్మాణానికి ఈ నెల 19ననే టెండర్లకు పిలిచాం. రూ.30లక్షల అంచనాతో నిర్మాణం చేపట్టనున్నాం. టెండర్‌లో పనులు దక్కించుకున్న గుత్తేదారుతో త్వరలో ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–జనార్దన్, దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి

ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు



సంఘంలో సభ్యత్వం తీసుకుంటున్న పూర్వ విద్యార్థులు

పాములపాడు: 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రాచారి అన్నారు. ఆదివారం స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీ హై స్కూలులో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంఘంపై ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాఠశాలలో చదివిన ప్రతి పూర్వపు విద్యార్థి సభ్యత్వం పొంది, పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. 10వ తరగతిలో మొదటి, రెండవ, మూడో స్థాయిలో నిలిచిన విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీన వరుసగా రూ.20,000, రూ.10,000, రూ. 5000 చొప్పున నగదు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించేందుకు ట్రస్ట్ కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. అంతే కాకుండా నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంటు శిక్షణా తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. తమ వంతుగా మైదానంలో 4 సిమెంటు బెంచీలు ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. ట్రస్ట్ అకౌంటులో ఆ సంఘం కార్యదర్శి అచ్యుతరావు రూ.40,000 జమ చేస్తానని తెలిపారు. దాతలు ఇంకా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం కార్యదర్శి జయశంకర్‌రెడ్డి, సభ్యులు రమణారెడ్డి, దేవ భూషణం, రామారావు, ఇస్మాయిల్, రోషిరెడ్డి, రాంప్రసాద్, సాహెబ్ ఉసేన్, రోశన్న తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండల పరిధిలోని బొల్లవరం గ్రామ సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ చేసేందుకు దొంగలు ప్రయత్నించినట్లు బ్రాహ్మణకొట్కూరు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దొంగలు ఆలయం తలుపులను పగులగొట్టేందుకు యత్నించగా రాకపోవడంతో సమీపంలోని చిల్లర దుకాణంలో దొంగతనానికి పాల్పడ్డారు. దుకాణంలోని సరుకులను దొంగలించినట్లు పోలీసులు తెలిపారు.

బీఎస్పీ నూతన కమిటీ ఎన్నిక

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. పార్టీ నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ లాజర్, తాలూకా ఇన్‌చార్జ్ ఎల్ స్వాములు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి నరేంద్రమోదీ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. అగ్రకులాల నాయకుల అక్రమ సంపాదనతో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ నల్లధనాన్ని వెలికితీసి పేదరికాన్ని నిర్మూలించడంలో విఫలం అయ్యారని తెలిపారు. అనంతరం బీఎస్పీ మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా రాజు, కన్వీనర్‌గా షేక్షావలి, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామితో పాటు 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాలూకా నాయకులు పెద్దన్న, నాగన్న, లోకేష్, చిన్నవిజయ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీకి తరలివెళ్లిన వాల్మీకులు

మహానంది: వాల్మీకుల హక్కుల సాధన కోసం నంద్యాలలో ఆదివారం చేపట్టిన ర్యాలీకి గాజులపల్లె నుంచి వాల్మీకులు భారీగా తరలివెళ్లారు. మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మీనిగ నారాయణ, జయరాం(హోటల్ జయరాం) ఆధ్వర్యంలో నంద్యాలకు బైకు ర్యాలీగా వెళ్లి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణపై అసెంబ్లీలో తీర్మానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ఒప్పించి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా కృషి చేయాలన్నారు.

శ్రీశైలంలో భారీగా అంతర్గత బదిలీలు !

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను భారీగా అంతర్గత బదిలీలు చేసినట్లు తెలిసింది. మొత్తం 42 మంది ఉద్యోగులను అంతర్గతంగా స్థానాలు మార్చినట్లు సమాచారం. వీరిలో నలుగురు ఏఈఓలతో పాటు 13 మంది పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, తదితరులు ఉన్నారు. దేవస్థాన పారిశుద్ధ్య నిర్వాహకులకు ఏఈఓగా ఉన్న ఫణిధరప్రసాద్‌ను రెవెన్యూ సెక్షన్‌కు, వసతి విభాగ ఏఈఓ మోహన్‌ను స్వామి అమ్మవార్ల దేవాలయానికి, స్వామి అమ్మవార్ల దేవాలయానికి ఏఈఓగా ఉన్న ఎం.హరిదాసును వసతి విభాగానికి, రెవెన్యూ సెక్షన్ ఏఈఓగా ఉన్న శ్రీనివాసరెడ్డిని శానిటేషన్ విభాగానికి బదిలీ చేసినట్లు సమాచారం. అలాగే కె.సాయికుమారిని స్వామి వారి ఆలయ పర్యవేక్షకురాలిగా, వెంకటేశ్వరరావును స్వామి ఆలయ పర్యవేక్షకులు మొదటి షిఫ్ట్‌కు బదిలీ చేశారు. స్వామి వారి ఆలయంలో పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న స్వాములును అమ్మవారి ఆలయ పర్యవేక్షకులుగా, శివప్రసాద్‌ను రెవెన్యూ సెక్షన్ పర్యవేక్షకులుగా నియమించినట్లు తెలుస్తోంది.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

నందికొట్కూరు: రౌడీ షీటర్లలో సత్ప్రవర్తనతో మెలగాలను టౌన్ సీఐ విజయభాస్కర్ సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. మన చుట్టూ ఉన్న అందరితో మంచిగా మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో తప్పని సరిగా మార్పులు కనిపించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎన్వీ రమణ, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టౌన్ సీఐ విజయభాస్కర్

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోం చేసుకోవాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని సచివాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం ప్రతి రోజు ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని వివరించారు.

25న విద్యా సంస్థల బంద్

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను ఈ నెల 25వ తేదీన బంద్ నిర్వహిస్తున్నామని, ఈ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు ఫీజులను ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తున్నాయని, వీటిని నియంత్రించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పెంచిన ఫీజులకు నిరసనగా చేపడుతున్న బంద్‌కు సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దినేష్, అంజి, మహేష్, అశోక్ పాల్గొన్నారు.

నేడు ఎర్రమఠంలో మొబైల్ ఎక్స్‌రే శిబిరం

కొత్తపల్లి: ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మొబైల్ ఎక్స్‌రే శిబిరం నిర్వహిస్తున్నామని, దీనిని పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు జబ్బీర్ బాషా ఆదివారం తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని ఎర్రమఠం, జానాలగూడెం, బలపాలతిప్ప, కపిలేశ్వరం, పాత మాడుగుల, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లెల్లోని ప్రజలు దగ్గు, బొంగ, ఆయా సం, ఊపిరితిత్తుల్లో నిమ్ము, విపరీతంగా పొగతాగే వారైనా, ఊపిరితిత్తుల్లో ఎటువంటి అసౌకర్యం ఉన్నా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చునని చెప్పారు. ఏ వయస్సు వారైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆధార్‌తో సంప్రదించి వైద్యపరీక్షలు చేయించుకోవచ్చన్నారు.

అంటు రోగాల నివారణకు చర్యలు చేపట్టాలి

ఆత్మకూరు: వర్షాకాలం ప్రారంభమైనందున పట్టణంలో అంటు రోగాలు ప్రబలకుండా అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, స్వాములు కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా డ్రైనేజీ లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకే రోడ్ల మీద నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయని చెప్పారు. దోమలు వ్యాప్తి చెంది పురప్రజలను అంటురోగాల బారిన పడేసే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేంద్ర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతో ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దు

మహానంది: వాహనదారులు అతివేగంతో వెళ్తూ ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దని బండిఆత్మకూరు ఎస్ఐ మల్లికార్జున అన్నారు. బండిఆత్మకూరులో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అజాగ్రత్తగా, మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురయితే ఎంతో నష్టపోవాల్సి ఉంటుందన్నారు. పది వాహనాలకు వివిధ కారణాలతో జరిమానాలు విధించారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.6.11కోట్లతో 10 దేవాలయాల నిర్మాణం



పారుమంచాలలో ఆలయ నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఈఓ వెంకటరమణ

జూపాడుబంగ్లా: దేవదాయ, ధర్మదాయశాఖ పరిధిలోని నందికొట్కూరు గ్రూపు దేవస్థానాల్లో రూ.6.11 కోట్ల నిధులు వెచ్చించి 10 దేవాలయాల్లో నిర్మాణం పనులు చేస్తున్నట్లు ఈఓ వెంకటరమణ వెల్లడించారు. పారుమంచాల గ్రామంలో శ్రీరాములవారి ఆలయ నిర్మాణం పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు రూ.6.11కోట్ల సీజీఎఫ్ నిధులు, దేవదాయశాఖ నిధులు వెచ్చించి శిథిలమైన దేవాలయాలను పునరుద్ధరించటంతో పాటు నూతన ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. నందికొట్కూరు గ్రూపు దేవస్థానం పరిధిలో మండ్లెంలో రూ.60లక్షల సీజీఎఫ్ నిధులు వెచ్చించి శివాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే పారుమంచాల గ్రామంలో రూ.1.50కోట్ల నిధులు వెచ్చించి తిరుమల-తిరుపతి ఈఓ ధర్మారెడ్డి సహకారంతో శ్రీరాములవారి నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. నందికొట్కూరు మండలంలోని మల్యాల గ్రామంలో రూ.5లక్షలతో శివాలయానికి కాంపౌండు నిర్మించినట్లు వెల్లడించారు. పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామంలో రూ.50లక్షల నిధులు వెచ్చించి శ్రీచెన్నకేశవ, శ్రీరామచంద్రులవారి ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. మిడుతూరు మండలంలోని భైరాపురం గ్రామంలో రూ.50లక్షలతో శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీపనగండ్లలో రూ.80లక్షలతో శ్రీచెన్నకేశవస్వామి ఆలయనిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. పగిడ్యాల మండలంలోని లక్ష్మాపురంలో రూ.26లక్షలతో శ్రీచెన్నకేశవ, శ్రీఆంజనేయస్వామివార్ల ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. ముచ్చుమర్రి లో రూ.1.50కోట్ల వ్యయంతో శ్రీచెన్నకేశవ, అమృతలింగేశ్వరస్వామివార్ల ఆలయ నిర్మాణానికి దేవదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. నందికొట్కూరు శ్రీసుంకులాపరమేశ్వరీ ఆలయం ముందు రూ.20లక్షలతో షెడ్డునిర్మాణం, శ్రీఆంజనేయస్వామి వారికి రూ.20లక్షలతో వెండి తొడుగు పనులు చేయిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో నిర్మాణం పనులను పూర్తిచేసి ఆలయాల ప్రతిష్ఠమహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయాలు ఏవైనా శిథిలమైనట్లయితే తమదృష్టికి తెస్తే మరమ్మతులు లేదా పునరుద్ధరణకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ఆత్మకూరు: మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన కాగుల శ్రీధర్ అనే వ్యక్తి ఇటీవల పాములపాడు మండలం, రుద్రవరం గ్రామ సమీపంలో రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ శ్రీధర్‌ను కర్నూలులోని ప్రైవేటు వైద్యశాలలో వైద్యం చేయించుకొని ఇంటికి చేరుకున్నాడు. ఇంకా ఆరోగ్యం మెరుగు పడేందుకు ఇంటి వద్దే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. కాగా, శ్రీధర్ భార్య లావణ్య వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఇటీవల గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె అత్యధిక శాతం సర్వే పూర్తి చేయడంతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అభినందించారు. ఆమె భర్త చికిత్స కోసం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆర్థిక సహాయం అందించడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు , నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పర్యటన




కడుమూరులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సల్కోటి జనార్దన్‌రెడ్డితో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య

మిడుతూరు: శాసనమండలి సభ్యులు డాక్టర్ మధుసూదన్ ఆదివారం మండలంలోని కడుమూరు, చెరుకుచెర్ల గ్రామాల్లో పర్యటించారు. కడుమూరు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సల్కోటి జనార్దన్ రెడ్డి స్వగృహానికి చేరుకొని ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కడుమూరు గ్రామంలో గతంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి స్థలం విరాళంగా అందజేశామని, ఇక్కడే వైద్య సిబ్బంది నివాసం ఉండటానికి క్వార్టర్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్సీని కోరారు. అదేవిధంగా మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి పేరును నంద్యాల జిల్లాకు నీలం సంజీవ రెడ్డి జిల్లా నామకరణం చేసేలా కృషి చేయాలని అభ్యర్థించారు. అనంతరం చెరుకుచెర్ల గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్సీకి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. భైరాపురం గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలని గ్రామ ప్రజలు ఎమ్మెల్సీని కోరారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సల్కోటి గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ ధర్మారెడ్డి, నాయకులు కమతం వీరారెడ్డి, పేరెడ్డి సుబ్బారెడ్డి, రాముడు, అంబాల రమణారెడ్డి, పేరెడ్డి శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పచ్చని అందాల నల్లమలతో దోబూచులాడుతున్న మేఘాలు

పచ్చందాల నెలవు నల్లమల



ఆత్మకూరు-బైర్లూటి మధ్య పచ్చబడ్డ నల్లమల .



బైర్లూటి- రోళ్లపెంట వద్ద నల్లమల అందాలు

ఆత్మకూరు: నల్లమల కొండలు ప్రకృతి అందాలకు నెలవు. వర్షాలు పుష్కలంగా కురవడంతో నల్లమల ప్రాంతం పచ్చదనాన్ని సంతరించుకుంది. ఎత్తైన కొండలు, కోనల మధ్య అడవితల్లి పచ్చని బయళ్లు ప్రకృతి అందాలతో కనువిందు చేస్తున్నాయి. ఆత్మకూరు నుంచి శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదారల్లో బైర్లూటి, రోళ్లపెంట, తుమ్మలబైలు, శిఖరం, లాంటి ప్రదేశాలు ప్రకృతి ప్రేమికులను ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గత నాలుగురోజులుగా వర్షాలు కురుస్తుండటంతో మేఘాలు కొండలను తాకుతూ చూపరులను పరవశింపజేస్తున్నాయి. శ్రీశైలం- ఆత్మకూరు రహదారికి ఇరువైపులా ఎత్తైన చెట్లు రహదారికి మరింత శోభ చేకూరుస్తున్నాయి. నల్లమల ప్రకృతి అందాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

కొనసాగుతున్న వర్షాలు

జూపాడుబంగ్లా: అల్పపీడన ప్రభావం వల్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఐదు రోజుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తూ ఉన్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 4.4మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరులో అత్యధికంగా 13.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పాములపాడులో 2.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు తెలిపారు. కొత్తపల్లి మండలంలో 9.4 ఎం.ఎం, మిడుతూరులో 6.4 ఎం.ఎం, పగిడ్యాలలో 6.2ఎం.ఎం, జూపాడుబంగ్లా మండలంలో4.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. ఇప్పటిదాకా కురిసిన వర్షాలు జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు మండలాల్లో లోటు వర్షం పాతం ఉండగా కొత్తపల్లి, నందికొట్కూరు మండలాల్లో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిసినట్లు వివరించారు.

ఆత్మకూరు డివిజన్‌లో వర్షం

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో ఆదివారం విస్తారంగా వర్షాలు కురిశాయి. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు ఆదివారం వేకువజామున ఆత్మకూరులో 2.6 మిమీ, వెలుగోడు 10.2 మిమీ, కొత్తపల్లి 9.4 మి.మీ, పాములపాడు 2.4మిమీ, బండిఆత్మకూరు మండలంలో 3.2 మిమీ, మహానంది మండలంలో 2.8 మిమీ వర్షం కురిసింది. ఈ వర్షం రైతులు సాగు చేసిన ఖరీఫ్ పంటలకు ఎంతగానో ఉపయోగపడనుంది. వరుసగా వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

26న సర్వసభ్య సమావేశం

నందికొట్కూరు రూరల్ : ఈ నెల 26న పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శోభారాణి తెలిపారు. ఈ సమావేశాన్ని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులతో పాటు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని ఆమె కోరారు.